సాక్షి
వికారాబాద్
శనివారం। 4। జనవరి। 2025



నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్న మహిళ మృతి చెందిన సంఘటన పరిగిలో శుక్రవారం చోటుచేసుకుంది. 10లో▸



దొంగల హల్‌చల్

తాండూరు మండలం చెన్‌గేస్‌పూర్ అనుబంధ గ్రామం కోనాపూర్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. 10లో▸



ఆటో,లారీ ఢీ

ఎదురెదురుగా వస్తున్న ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. 10లో▸

న్యూస్‌రీల్

నేడు మర్పల్లికి స్పీకర్ ప్రసాద్‌కుమార్

మర్పల్లి: మండలంలో శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పర్యటించనున్నట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మర్పల్లి వ్యవ సాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తారని పేర్కొన్నారు. తుమ్మలపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఆయిల్‌పాం శాస్త్రవేత్త, జిల్లా ఇన్‌చార్జ్ రంగనాయక్



ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రంగనాయక్

మోమిన్‌పేట: ఆయిల్‌పాం తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని ఆయిల్‌పాం శాస్త్రవేత్త, జిల్లా ఇన్‌చార్జ్ రంగనాయక్ సూచించారు. శుక్రవారం మోమిన్‌పేట రైతు వేదికలో అన్నదాతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం 90శాతం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. మొక్కలు మొదలుకొని ఎరువులు, డ్రిప్ పరికరాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఆయిల్‌పాం తోటల్లో అంతర పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. పంట సాగు చేసిన నాలుగేళ్ల నుంచి కోతకు వస్తుందన్నారు. నీరు పుష్కలంగా ఉంటే 30 సంవత్సరాల పాటు దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు పెంటయ్య, చంద్రిక, రైతులు పాల్గొన్నారు.

పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి



జక్కేపల్లిలో కంది పంటను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి

యాలాల: యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని జక్కేపల్లి శివారులోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఆయన వెంట అగ్గనూరు క్లస్టర్ ఏఈఓ గోపి ఉన్నారు.

అడవులను రక్షించుకుందాం

డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్



అనంతగిరి: అడవుల రక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అటవీశాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. గురువారం వికారాబాద్ సమీపంలోని ఫారెస్టు కార్యాలయంలో అటవీశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నర్సరీల నిర్వహణ, ప్లాంటేషన్‌కు ఎలా సన్నద్ధం అవుతున్నారనే విషయాలపై ఆరా తీశారు. అటవీ ప్రాంత సమీపంలో పంటలు సాగు చేసే రైతులు పంట కోతల అనంతరం వ్యర్థాలను కాలుస్తుంటారని అలాంటి సమయంలో అడవులు అగ్ని ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అడవులను ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని సూచించారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓలు, ఎఫ్‌ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

కలగా ఇంటిగ్రేటెడ్

2021లో సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

- నాలుగేళ్లు కావస్తున్నా అసంపూర్తిగానే..
- ఒక్కో భవన నిర్మాణానికి రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్లు మంజూరు
- కొడంగల్, తాండూరు మున్సిపాలిటీల్లో ప్రారంభం కాని పనులు
- వికారాబాద్, పరిగిలో పిల్లర్ల దశలో..
- బిల్లులు మంజూరు కాకపోవడమే కారణం



పరిగి పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం

వికారాబాద్: జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. శంకుస్థాపన చేసి నాలుగేళ్లు కావస్తున్నా పనుల్లో ఏమాత్రం పురోగతి కనిపించడం లేదు. ప్రజలకు అన్ని రకాల సరుకులు, కూరగాయలు, పూలు, పండ్లు, ఆకుకూరలు, చేపలు, మాంసం, చికెన్ ఒకేచోట లభించేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ నిర్మించాలని భావించింది. జిల్లాలోని కొడంగల్, పరిగి మున్సిపాలిటీల్లో రెండు ఎకరాలు, వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో ఆరు ఎకరాల చొప్పున స్థలం కేటాయించారు. 2021లో టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ఆ వెంటనే పనులకు శంకుస్థాపన చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. పనుల పర్యవేక్షణ బాధ్యతలు కలెక్టర్‌కు అప్పగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా కొడంగల్, తాండూరు మున్సిపాలిటీల్లో శంకుస్థాపన చేసి వదిలేశారు. వికారాబాద్, పరిగి పట్టణాల్లో పనులు ప్రారంభించినా ముందుకు సాగడం లేదు. ఈ రెండు చోట్ల పిల్లర్ దశలోనే పనులు ఆగిపోయాయి.

బిల్లులు రాకపోవడంతో..

కార్పొరేట్ షాపింగ్ మాల్స్ తరహాలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. అధునాతన భవన సముదాయం నిర్మించి అక్కడే అన్ని రకాల కూరగాయలు, సరుకులు, చికెన్, మటన్, పూలు, పండ్లు లభించేలా షాపింగ్ మాల్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందుకు తగ్గట్లు భవన సముదాయాన్ని రూపకల్పన చేశారు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్లలో షాపులు కట్టాలని నిర్ణయించారు. పనులు మంజూరైనా బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలో ఆపేశి వెళ్లిపోయారు. ప్రస్తుతం పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీల్లో పిల్లర్ దశలో దర్శనమిస్తున్నాయి. నాలుగేళ్లుగా పనులు ఆగిపోవడంతో ప్రజాధనం నిరుపయోగంగా మారింది.

అందుబాటులోకి వస్తే..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. అంతే కాకుండా సరుకుల కోసం వేర్వేరు ప్రాంతాలకు పరిగెత్తాల్సిన పని ఉండదు. అన్ని సరుకులు ఒకేచోట లభిస్తే సమయం కూడా కలిసొస్తుంది. సరుకుల ధరలు కూడా అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న సమీకృత మార్కెట్లను వెంటనే అందుబాటులోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'శాశ్వత' పరిష్కారం!

- అద్దె భవనంలో 'పట్నం' సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- సొంత భవనం నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయం
- స్థల అన్వేషణ పూర్తి చేసిన రెవెన్యూ అధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: క్రయవిక్రయదారులు.. ఏజెంట్లు.. డ్యాక్యుమెంట్ రైటర్లతో నిత్యం కళకళలాడుతూ కాసుల వర్షం కురిపించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవన నిర్మాణాలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఆయా కార్యాలయాల పరిధిలో స్థల అన్వేషణ మొదలు పెట్టింది. ఏటా రూ.వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూర్చిపెట్టే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చాలా వాటికి సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో.. ఇరుకు గదుల్లో.. అరకొర సౌకర్యాల మధ్య సిబ్బంది కార్యాకాలపాలు కొనసాగిస్తున్నారు. కార్యాలయానికి వివిధ వాహనాల్లో వచ్చేవారికి పార్కింగ్ చేసేందుకు సైతం స్థలం కరువైంది. రోడ్ల పైనే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇబ్రహీంపట్నంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పడిన నాటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. మున్సిపల్ స్థలంలో కొత్తగా ఒక కాంప్లెక్స్‌ను నిర్మించి, ఆ భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భావించారు. ఇందుకు అనుగుణంగా పాత బస్టాండ్ వద్ద కాంప్లెక్స్ భవన పనులు ప్రారంభించారు. స్లాబ్‌వరకు నిర్మాణం జరిగిన తర్వాత నిధులు లేక అర్ధంతరంగా ఆగిపోయాయి.

రెండు చోట్ల ప్రతిపాదనలు

కాంగ్రెస్ ప్రభుత్వం అద్దె భవనాల్లో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు మూడు దశల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ఇబ్రహీంపట్నం కార్యాలయానికి స్థల అన్వేషణ చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో మంగల్‌పల్లి రెవెన్యూ పరిధి బొంగుళూర్ సమీపంలో 84 సర్వే నంబర్‌లోని 35 గుంటలు, ఖానాపూర్ సమీపంలో 320 సర్వేనంబర్‌లోని ఆరు ఎకరాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుకూలంగా ఉన్నట్లు తేల్చారు. 320 సర్వే నంబర్‌లోని భూమి గతంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణానికి కేటాయించినప్పటికీ ఇప్పటికీ అక్కడ ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో ఖాళీగానే ఉంది. ఈ భూమిని తిరిగి తీసుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయించాల్సి ఉంటుంది. శాశ్వత భవనాన్ని నిర్మిస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి, అక్కడికి నిత్యం వచ్చేవారికి తిప్పలు తప్పినట్లే. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వతంగా నూతన భవన నిర్మాణానికి స్థల అన్వేషణ జరుగుతోందని తహసీల్దార్ సునీతరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ సోని తెలిపారు. మండలంలోని రెండు చోట్ల ఖాళీ స్థలాలకు సంబంధించిన ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపినట్లు వివరించారు. ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని ప్రభుత్వ భూమిలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



పీఏసీఎస్ నూతన చైర్మన్, ఎమ్మెల్యే, డైరెక్టర్లను సన్మానించిన అధికారులు

రైతుల సంక్షేమానికి కృషి

- అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు అందుతాయి
- దోమ పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణా స్వీకారంలో ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

దోమ: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దోమ పీఏసీఎస్ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా ఆగికాల యాదవరెడ్డితో అధికారులు ప్రమాణా స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. జిల్లాలో రూ.300 కోట్ల పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా ఎకరాకు రూ.15 వేల చొప్పున పంట పెట్టుబడి సాయం ఇస్తుందన్నారు. భూమి లేని రైతులకు ఏడాదికి రూ.12 వేలు, పెన్షన్లు, అర్హులకు రేషన్ కార్డులు, సన్నరకం బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

భగ్గుమన్న వర్గపోరు

పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణా స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఒక వర్గానికి చెందిన నేతల ఫొటోలు ఉండటంతో మరో వర్గం ఆందోళనకు దిగింది. తమ ఫొటోలు ఎందుకు పెట్టలేదని ఫ్లెక్సీని చింపేశారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. నాయకులు కలుగజేసుకొని ఫ్లెక్సీ చింపిన వారిని అక్కడి నుంచి పంపేశారు. కాసేపటికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఫ్లెక్సీ చింపిన వర్గం అక్కడికి వచ్చి ఆందోళనకు దిగారు. పార్టీలో తమకు సముచిత స్థానం లేదంటూ మరో ఫ్లెక్సీని చింపేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తాము ఎంతో కృషి చేశామని, ఓట్లు వేసిన పాపానికి తమను అరెస్టు చేశారని పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల మధ్య సమన్వయ లోపం ఉందని, ఎమ్మెల్యే పరిస్థితులను చక్కబెట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పీఏసీఎస్ వైస్ ప్రసిడెంట్ బసన్నగౌడ్, డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, శేఖరయ్య, భాస్కర్, మల్లేశ్, కిష్టమ్మ, ఏఎంసీ డైరెక్టర్లు శాంతకుమార్, ప్రభాకర్‌రెడ్డి, అనంతయ్య, నర్సింహులు, పార్టీ సీనియర్ నాయకులు అంతిరెడ్డి, రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నేతలను కారులో ఎక్కిస్తున్న పోలీసులు

పారిశుద్ధ్యంపై నిఘా పెట్టండి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై మరింత నిఘా పెట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల్లో పర్యటించి రికార్డుల నిర్వహణ, కార్యదర్శుల పనితీరుపై సమీక్ష నిర్వహించాలని అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి, గ్రామీణ పాలన అంశంపై జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శ్రీలతతో కలిసి ఎంపీడీఓలు, ఏపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులను ఉపేక్షించొద్దని, తరచూ విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పారుక్కులు, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరా నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. వైకుంఠ ధామాల చుట్టూ కంచెలు నిర్మించి, మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలకు విధిగా నీరు అందించాలని, 18 ఏళ్లు పైబడిన వారికి జాబ్ కార్డులు అందజేయాలని, ఏప్రిల్ ఒకటి నుంచి మే 31 వరకు 70 శాతం కూలీలను మొబిలైజ్ చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ప్రతి అప్లికేషన్‌ను పరిశీలించి రీ–వెరిఫికేషన్ కోసం ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు.

పూలే జీవితం స్ఫూర్తిదాయకం

- మహనీయుల ఆశయ సాధనకు కృషి చేద్దాం
- కలెక్టర్ ప్రతీక్‌జైన్



విద్యార్థినితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సావిత్రిబాయి పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆమె చూపిన బాటలో నడుద్దామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె చిత్రపటాలనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎందరో మహనీయులు భవిష్యత్ తరాల కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని వారి జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడారు. జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే సాంఘిక దురాచారాలను అరికడుతూనే మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మహిళలు విద్యావంతులు అయినప్పుడే వారు సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని గ్రహించగలుగుతారని గుర్తించి 1848 సంవత్సరంలోనే మొట్ట మొదటి మహిళా పాఠశాలను నెలకొల్పారని పేర్కొన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా ఆమె చేసిన సేవ ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీఈఓ రేణుకాదేవి, డీపీఓ జయసుధ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, డీపీఆర్‌ఓ చెన్నమ్మ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో తనిఖీలు

కొడంగల్: పట్టణంలోని వసతి గృహాలను కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఆకస్మికంగా తనికీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వంట గదులు, సామగ్రి, బియ్యం నిల్వను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కొత్త మోనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం, ఏఈ రాకేశ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి భీమరాజ్, వార్డెన్లు వరలక్ష్మి, నారాయణ, శ్రీనివాస్, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

పరిగి: ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. శుక్రవారం పరిగి పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ గిరిజన వసతి గృహం, ప్రీ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం, తుంకులగడ్డలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించాలని సూచించారు. వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. మరమ్మతులకు నిధులు అవసరం అయితే మంజూరు చేస్తామన్నారు. అనంతనం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ సూపర్

పరిగి: పట్టణంలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంటీన్‌ను శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉండటంతో నిర్వాహకులను అభినందించారు. ఇకపై ఇలాగే కొనసాగించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి క్యాంటీన్‌లో మిర్చి, టిఫిన్ చేసి బాగుందని కితాబు ఇచ్చారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని, మంచి లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించాలి

- అన్ని శాఖలతో పోలీస్ శాఖను పోల్చుకోవద్దు
- శాంతిభద్రతల పరిరక్షణ నిరంతర ప్రక్రియ
- ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి



శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కవాతు

ఇబ్రహీంపట్నం: శాంతిభద్రతలను పరిరక్షించడం నిరంతర ప్రక్రియ అని, అన్ని ప్రభుత్వశాఖల పనితీరుతో పోలీసు శాఖను పోల్చుకోవద్దని రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి సూచించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్ ఆవరణలో 3వ బెటాలియన్ (టీజీఎస్పీ)లో తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 288 మంది స్పెషల్ పోలీసులతో శుక్రవారం నిర్వహించిన 4వ బ్యాచ్ దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే మంచి పేరున్న తెలంగాణ పోలీసు శాఖలోకి వస్తున్నారని, బాధ్యతాయుతమైన పోలీసులుగా మీ కర్తవ్యం, బాధ్యతలు, విధులను సక్రమంగా నిర్వర్తిస్తారని ఆకాంక్షించారు. అన్ని శాఖల మాదిరిగా కాకుండా హక్కులు, స్వేచ్ఛలు పోలీసు శాఖకు పరిమితంగా ఉంటాయని తెలిపారు. కొత్తగా వెలుగు చూస్తున్న నేరాలు, శాంతి భద్రతల అంశం ప్రస్తుం సవాల్‌గా మారుతున్నాయని అన్నారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మీరు తీసుకున్న శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలను తప్పనిసరి పాటించాలని సూచించారు. యూనిఫాం వేసుకొని విధులు నిర్వర్తించే వారిని సమాజం వెయ్యి కళ్లతో చూస్తుంటుందని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీజీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, ఐఆర్‌ఎస్ అధికారి ప్రసాద్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, రిటైర్డ్ పోలీసు అధికారులు, శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంగ్లిష్ ఉపన్యాస పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపిక



వర్షిణి

దుద్యాల్: ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ ఉపన్యాస పోటీల్లో సత్తా చాటిన ముత్యపుగారి వర్షిణి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వర్షిణి కొడంగల్‌లో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. తల్లిదండ్రులు శ్రీనివాస్, సరోజ, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలు, జరిమానా

తాండూరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పది మందికి జైలు శిక్షతో పాటు, జరిమానా విధించినట్లు పట్టణ సీఐ సంతోష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన పలువురిని శుక్రవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఉమాహారతి ఎదుట హాజరుపరిచామని పేర్కొన్నారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన బాలకిష్టయ్యకు మూడు రోజులు, వడ్డే మహేశ్, యాదగిరికి రెండేసి రోజులు, రత్నం, పాండుగౌడ్, రియాజ్, రాజు, సంజీవ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నారాయణకు ఒక్కరోజు జైలు శిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించామని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.2,500 చొప్పున, తోపుడు బండితో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న మక్సూద్‌కు రూ.500 జరిమానా విధించారని పేర్కొన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

తాండూరు టౌన్: ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ లభ్యమైంది. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాతతాండూరులోని గడి ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫెరోజ్ కుమారుడు (14) ఈనెల 1న ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం ఉదయం వికారాబాద్ రైల్వే స్టేషన్ బాలుడిని గుర్తించిన రైల్వే పోలీసులు తాండూరుకు పీఎస్‌కు సమాచారం అందించారు. బాలుడిని తీసుకువచ్చిన స్థానిక పోలీసులు అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



తాండూరు రూరల్: విద్యుదాఘాతంలో ఓ ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని బిజ్వార్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి వెంకటప్ప వ్యవసాయం చేస్తూ జీవిస్తుంటారు. సాగుకు ఉపయోగించేందుకు రూ.2.20 లక్షలు వెచ్చించి రెండు ఎద్దులను కొనుగోలు చేశాడు. తన పొలంతో పాటు గ్రామంలోని వెంకట్‌రెడ్డి పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. శుక్రవారం గ్రామ శివారులో ఎద్దులు మేత మేస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ వైర్లు కిందకి ఉండటంతో ఒక ఎద్దుకు తగలి అక్కడికక్కడే మృతి చెందింది. పలుమార్లు విద్యుత్ అధికారులకు వైర్లు సరిచేయాలని కోరినా పట్టించుకో లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వెంకటప్ప కోరారు.

వైద్యుల నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

- పరిగిలోని సాధన ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

పరిగి: ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్న మహిళ మృతి చెందిన సంఘటన పరిగిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం గూడూరుకు చెందిన యాదమ్మ(40)కు ఆరోగ్యం బాగో లేకపోవడంతో ఈనెల 1న సాధన ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు గర్భాశయం తీసేయాలని చెప్పడంతో బుధవారం సాయంత్రం ఆపరేషన్ చేయించారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఆమె పరిస్థితి విషమించడంతో మృతురాలి బంధువులకు చెప్పకుండానే అంబులెన్స్‌లో వికారాబాద్‌లోని ఈశా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే యాదమ్మ చనిపోయిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో సాధన ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వచ్చీరాని వైద్యంతో నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నారని మండిపడ్డారు. ఆపరేషన్ ఫెయిల్ కావడంతోనే యాదమ్మ చనిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రితో పాటు వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో వైద్యులు, యాజమాన్యం అక్కడి నుంచి పరారయ్యారు. రోడ్డుపై భారీగా జనం పోగవడం, ఆస్పత్రిలో ఆందోళన వాతావరణం నెలకొనడంతో విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై సాధన హాస్పిటల్ ఎండీ డాక్టర్ ఆంజనేయులును వివరణ కోరగా.. ఆపరేషన్ చేసిన మరుసటి రోజు రోగిని నడిపించామని, శుక్రవారం ఉదయం నడిపిస్తుండగా మూర్ఛ రావడంతో ఈశా ఆస్పత్రికి తరలించామని, ఈ సమయంలో గుండెపోటు రావడంతో యాదమ్మ మృతిచెందిందని తెలిపారు.

ఎదురెదురుగా ఆటో, లారీ ఢీ

- ఐదుగురికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులందరూ మహిళా కూలీలే
- పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం



ఢీ కొన్న ఆటో, లారీ

దుద్యాల్: ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో పలువురు కూలీలు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దుద్యాల్ మండలం హస్నాబాద్‌కు చెందిన కూలీలు నిత్యం ఇతర ప్రాంతాలకు పనికి వెళ్తారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని ఇళ్లకు వస్తుండగా.. కొడంగల్ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడగా మరో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వెంటనే కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన అలివేలు, సమ్రీన్, గౌతాబేగంను మెరుగైన చికిత్స కోసం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

చలిని తట్టుకోలేక యాచకురాలి మృతి

పహాడీషరీఫ్: చలిని తట్టుకోలేక గుర్తు తెలియని ఓ యాచకురాలు మృతి చెందింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం వెలుగుజూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లిలోని బీఆర్‌ఎస్ కార్యాలయ పరిసరాలలో రెండు రోజులుగా సుమారు 65–75 ఏళ్ల వయసున్న ఓ గుర్తు తెలియని వృద్ధురాలు యాచిస్తూ కనిపించింది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో వృద్ధురాలు పడిపోయి ఉండడం గమనించిన స్థానికులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. చలిలో ఆరు బయట పడుకున్న కారణంగానే వృద్ధురాలు మృతి చెంది ఉంటుందని పోలీసులు వెల్లడించారు. సంబంధీకులెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సంప్రదించాలన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఒకరి మృతి

నందిగామ: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చంద్రాయన్‌గూడ సమీపంలో పాత జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండలం పీర్లగూడెం గ్రామానికి చెందిన నర్సింహులు (60), సురేష్, కృష్ణయ్య నందిగామ మండలం నర్సప్పగూడలో జరిగే ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఫంక్షన్ ముగించుకొని బైక్‌పై సొంత ఊరుకు బయలుదేరారు. చంద్రాయన్ గూడ సమీపంలోకి రాగానే షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న బైక్‌ను అతి వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా బస్సు కిందకు వెళ్లిపోగా నర్సింహులు తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుడి కుమారుడు లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



అధికారులతో సమావేశమైన రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

శంకర్‌పల్లి: పట్టణ శివారులో మూడు రోజుల పాటు నిర్వహించే ఇస్తేమా కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఇస్తేమా నిర్వహించే ప్రదేశాన్ని శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, జిల్లా అధికారులతో కలిసి పర్యవేక్షించారు. చేవెళ్ల ఆర్డీఓ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



ఆయిల్‌పామ్ మొక్క నాటి నీళ్లు పోస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: ఆయిల్ పామ్ పంటలను సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందొచ్చని హార్టికల్చర్, సెరికల్చర్ జిల్లా అధికారి సురేష్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల శివారులోని రైతు వ్యవసాయ పొలంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన నిర్వహించారు. రైతు రంజిత్‌కుమార్ వ్యవసాయ పొలంలో ఆయిల్‌పామ్ మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందొచ్చని అన్నారు. ప్రతి ఎకరానికి 10 నుంచి 15 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, కంపెనీవారు కొనుగోలు చేస్తారని వెల్లడించారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి కాపు మొదలవుతుందని, 30 సంవత్సరాల వరకు నిరంతరం దిగుబడితో ఆదాయం వస్తుందని తెలిపారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు చీడపీడల బెడద, తెగుళ్లు, కోతులు, అడవిపందులు, పక్షులు, దొంగల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఏపీడీ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ హత్య

మొయినాబాద్: ఇటీవల అదృశ్యమైన ఓ మహిళ హత్యకు గురైంది. పరిచయమైన రెండు రోజుల్లోనే దుండగుడు ఆమెపై అత్యాచారం చేసి, నగలు దోచుకుని చంపేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారానికి చెందిన చేగూరి సువర్ణ (49) గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో 28న కుటుంబ సభ్యులు మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మహిళ ఫోన్ కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు ఆమె చివరిసారి షాబాద్ మండలం పోతిగల్‌కు చెందిన మల్లారెడ్డితో మాట్లాడినట్లు గుర్తించారు. గురువారం అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. హత్యకు రెండు రోజుల ముందే ఆమెతో పరిచయం ఏర్పడిందని.. గత నెల 27న ఫోన్ చేసి రమ్మంటే వచ్చిందని.. చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ రోడ్డువైపు తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు అంగీకరించాడు. ఆమె వద్ద ఉన్న బంగారు నగలు తీసుకుని విషయం ఎవరికైనా చెబుతుందేమోనని గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు ఒప్పుకొన్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్నామని.. రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. నిందితుడు గతంలోనూ షాబాద్‌కు చెందిన ఓ మహిళను సంకేపల్లి గూడెం వద్ద హత్యచేసి జైలుకు వెళ్లివచ్చాడు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: ఆటపాటలతో సాగాల్సిన పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ 11వ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ ఒక వ్యాధిలాగా మారిందని, అది ఎంతోమంది అమాయక పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తోందని పేర్కొన్నారు. రాచకొండ పరిధిలో మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, యాదాద్రి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాద్, బచ్ పన్ బచావో ఆందోళన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్‌లో దొంగల హల్‌చల్



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

- తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు
- గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ
- ఆగంతకులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడి

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ అనుబంధ గ్రామం కోనాపూర్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా గురువారం అర్ధరాత్రి నాలుగు ఇళ్లలో చొరబడి, అందినకాడికి చోరీ చేశారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, బాధితుల కథనం ప్రకారం.. కోనాపూర్‌కు చెందిన ఏపూరి రాములుకు రెండు ఇళ్లు ఉన్నాయి. రాత్రి ఒక ఇంటికి తాళం వేసి, మరో ఇంట్లో పడుకున్నారు. తాళం పగలగొట్టిన దుండగులు అంతా వెతికినా ఏమీ దొరకలేదు. అక్కడి నుంచి రంగంపల్లి వెంకటయ్య, బంటు తిప్పయ్య, బంటు నర్సింలు ఇళ్ల తాళాలు ధ్వంసం చేసి తిప్పయ్య ఇంట్లో రూ.2 వేలు, నర్సింలు ఇంట్లో తులంన్నర బంగారంతో పాటు కొంత నగదును దొంగలించారు. వెంకటయ్య ఇంట్లో ఎలాంటి నగదు, నగలు దొరకలేదు. బాధితులు ముగ్గురు తమకు సంబంధించిన పక్క ఇళ్లలో నిద్రించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు. క్లూస్ టీం ఆఫీసర్ శ్రీశైలం తన సిబ్బందితో వెళ్లి ఆధారాలు సేకరించారు.

బీసీలకు తీరని అన్యాయం

బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న మెట్టుకాడి శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో బీసీలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో శుక్రవారం బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెట్టుకాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలు వెనుకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని విమర్శించారు. రిజర్వేషన్లలో మనకు రావాల్సిన వాటాను సాధించుకొని మన నిధులు, అవకాశాలను చేజిక్కించుకోవాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో మనకు మనమే పోటీ కాకుండా మన ఓట్లను మనమే వేసుకొని విజయం సాధించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీసీమహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మచ్చ సుధాకర్‌రావు, జిల్లా సంయుక్త కార్యదర్శిగా బుద్ధ నర్సింహ్మా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీమహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మాధవాచారి, జిల్లా ప్రచార ఇన్‌చార్జి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో ఎక్సైజ్ దాడులు



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ సీఐ తదితరులు

22 లీటర్ల నాటుసారా స్వాధీనం

ఆమనగల్లు: కడ్తాల్ మండలం వాస్‌దేవ్‌పూర్, పల్లెచెల్కతండా, కొరచకుంట తండాల్లో శుక్రవారం ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. 22 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. పల్లెచెల్క తండాలో 550 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 22 లీటర్ల నాటుసారా, 40 కిలోల బెల్లం, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. పల్లెచెల్క తండాలో ఐదు కేసులు, వాస్‌దేవ్‌పూర్‌లో ఒక కేసు, కొరచకుంట తండాలో రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పాత్లావత్ జ్యోతి, దీపావత్ పూర్య, లక్య, సభావత్ లక్ష్మి, సభావత్ నేజీలను కడ్తాల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్‌లు కృష్ణప్రసాద్, స్వప్న, సిబ్బంది శంకర్, నర్సింహ, సురేశ్‌బాబు, దశరథ్, బాలస్వామి, బాబు తదితరులు ఉన్నారు.

విలీనానికి వేళాయే..

ఓఆర్ఆర్ వరకు ఉన్న పురపాలికలు 'గ్రేటర్'లోకి..



అనంతరం కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు

- ఈ సంవత్సరంలోగా ప్రక్రియ పూర్తి
- నేటి కేబినెట్ మీటింగ్‌లో చర్చకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ శివార్లలో ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) వరకున్న 24 పురపాలికలు త్వరలో జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి. ఈ నెల 25వ తేదీతో పురపాలికల పాలకమండళ్ల గడువు ముగిసిపోగానే వాటిని జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ కార్యరూపం దాల్చనుంది. విలీనం జరిగే వరకు స్పెషలాఫీసర్ల పాలన సాగనుంది. జీహెచ్ఎంసీలో పురపాలికలు విలీనమయ్యాక గ్రేటర్ మొత్తాన్ని ఒకే కార్పొరేషన్‌గా (గ్రేటర్ హైదరాబాద్ సిటీ కార్పొరేషన్) ఉంచుతారా, లేక ఎక్కువ కార్పొరేషన్లుగా చేస్తారా అన్నదానిపైనా స్పష్టత రానుంది. ఎటొచ్చీ ఈ సంవత్సరం ముగిసేలోగా కొత్త కార్పొరేషన్(లు) ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకుగాను కన్సల్టెన్సీ ఏజెన్సీ లేదా ప్రత్యేక కమిటీ క్షేత్రస్థాయి పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకొని కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు తదితరమైన వాటిపై నివేదిక రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఒకటి కంటే ఎక్కువ కార్పొరేషన్లు ఏర్పాటు చేసే పక్షంలో ఒక కార్పొరేషన్‌లోకి పూర్తిగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు, మరో కార్పొరేషన్‌లోకి అభివృద్ధి చెందని ప్రాంతాలు రాకుండా ఓఆర్ఆర్ లోపలి అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందేందుకు ఒక కార్పొరేషన్‌లో రెండూ ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

పెరగనున్న పరిధి

జీహెచ్ఎంసీ విస్తీర్ణం ప్రస్తుతం 625 చదరపు కిలోమీటర్లు కాగా, ఓఆర్ఆర్ వరకున్న పురపాలికల్ని కలిపితే దాదాపు 2000 చదరపు కిలోమీటర్లకు పెరగనుంది. ఇంతపెద్ద విస్తీర్ణం వరకు ఒకే కార్పొరేషన్‌గా ఉంటే పలు ఇబ్బందులు ఎదురవనున్న దృష్ట్యా ఎక్కువ కార్పొరేషన్ల ఏర్పాటుకే అవకాశాలున్నాయి. ఏర్పాటు చేసే కార్పొరేషన్ల సంఖ్యను బట్టి అన్నింటి విస్తీర్ణం దాదాపు సమానంగా ఉండనుంది. ఉదాహరణకు మూడు కార్పొరేషన్లు అయితే 600– 650 చదరపుకిలోమీటర్లు, నాలుగైతే 500 చదరపుకిలోమీటర్లు, రెండైతే 1000 చదరపు కిలోమీటర్ల వంతున విస్తీర్ణంతో ఏర్పాటు కానున్నాయి. గత సంవత్సరం ఓఆర్ఆర్‌కు దగ్గర్లో ఉన్న 51 గ్రామపంచాయతీలను సమీప 13 పురపాలికల్లో (శంషాబాద్, పెద్ద అంబర్‌పేట, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, గుండ్లపోచంపల్లి, తూంకుంట, ఘట్‌కేసర్, తెల్లాపూర్, అమీన్‌పూర్) కలపడం తెలిసిందే. అవి గ్రేటర్ పరిధిలోకి రానున్నాయి.

మెగా మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా..

ఓఆర్ఆర్ వరకు అర్బన్‌గా, తర్వాత ఆర్ఆర్ఆర్ వరకు సెమీ అర్బన్‌గా పరిగణించి అభివృద్ధి చేసేందుకు మెగా మాస్టర్‌ప్లాన్–2050 రూపొందిస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో అందుకనుగుణంగానే కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి.

రాజ'కీ'యమే ?

ఎన్ని కార్పొరేషన్లు చేయాలనేది రాజకీయ నిర్ణయంగా ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న ఎంఐఎం ఆలోచనను పరిగణనలోకి తీసుకుని ఎన్ని కార్పొరేషన్లు చేయాలనేది ఖరారు చేస్తారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. శనివారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ శివారు పురపాలికల విలీనం అంశం చర్చకు వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జీహెచ్ఎంసీలో ప్రస్తుతమున్న 6 జోన్ల విస్తీర్ణం ఇలా..

జోన్	విస్తీర్ణం (చ.కి.మీ.)
ఖైరతాబాద్	76.10
ఎల్‌బీనగర్	128.21
సికింద్రాబాద్	61.37
కూకట్‌పల్లి	113.15
చార్మినార్	98.61
శేరిలింగంపల్లి	132.22

- కొత్తగా ఏర్పాటయ్యే కార్పొరేషన్ల సంఖ్యను బట్టి, ఒక్కో కార్పొరేషన్‌లో ఎన్ని జోన్లు, ఎన్ని వార్డులుండాలో నిర్ణయం తీసుకోనున్నారు. వార్డుల మధ్య సైతం వ్యత్యాసం లేకుండా జనాభా దాదాపుగా సమానంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు.
- కొత్త కార్పొరేషన్‌లోనే ఎన్నికలు: జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలకమండలి గడువు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో ముగియనుంది. ఆ లోగా ఈ కసరత్తు మొత్తం పూర్తిచేసి ఎన్నికలు నిర్వహించాలనేది ప్రభుత్వ యోచనగా ఉంది.